క్లుప్తంగా

'పది' స్పాట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్రంలో భౌగోళికంగా అతి పెద్ద జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పదో తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఈ.వెంకటేశ్వరరావు, బి.రవి మంగళవారం కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూల్యాంకన కేంద్రం లేకపోవడం వలన జిల్లా ఉపాధ్యాయులు సుమారు 100 నుంచి 150 కిలో మీటర్లు ప్రయాణం చేసి ఖమ్మం వెళ్లడం వలన ఆరోగ్య సమస్యలతో పాటు, ఆర్థిక భారాన్ని కూడా ఎదుర్కొంటున్నారని వివరించారు. ఉపాధ్యాయ సంక్షేమం దృష్ట్యా పదో తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



వాలీబాల్ కిట్లు అందజేస్తున్న సీతారాములు

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండల పరిధి మైలారం గ్రామంలోని యువజన సంఘానికి టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు మంగళవారం వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. క్రీడలు యువకులకు శారీర దృఢత్వంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. యువకులు, విద్యార్థులు క్రీడారంగంలో ముందుండాలని, ప్రతి విద్యార్థి చదవటంతో పాటు ఆటలు కూడా అలవాటు చేసుకోవాలి తెలిపారు. మండలంలోని పలు గ్రామల యువతకు ఇప్పటి వరకు 8 కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ మడిపల్లి శ్రీనివాసులు, ఓబీసీ మండల అధ్యక్షుడు వీరబాబు, స్థానికులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



ప్రారంభిస్తున్న చైర్మన్ డీవీ

ఇల్లెందు: పట్టణంలోని 24వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. స్థానిక వార్డు కౌన్సిలర్ వి.తార, కమిషనర్ అంకుశావలితో కలిసి కంటి వెలుగును ప్రారంభించి కళ్ల జోళ్లను అందజేశారు. అనంతరం లేక్ వ్యూ పార్క్ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఏఈ శంకర్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగుండాల గ్రామపంచాయతీ సువర్ణాపురం గ్రామంలోని పెద్దమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రావపెద్దలు ఆలయ ప్రాంగణంలో వేద మంత్రోచ్చరణల మధ్య చండీయాగం, హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, హరిసింగ్‌నాయక్ దంపతులు యాగం, హోమంలో పాల్గొని ప్రత్యేక పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కుంజ కృష్ణ, అలెం కౌసల్య, మాడె సునిత, ఎంపీటీసీ పూనెం లింగమ్మ, ఆలయ ధర్మకర్త కొడెం వెంకటమ్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు భరత్, బయ్య వేణు, బొల్లం శ్రీను, ముక్తి ఆంజనేయులు, యుగంధర్, జేకే శ్రీను, కొక్కు నాగేశ్వరరావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కోనో కార్పస్ మొక్కలు తొలగించాలి



రంజిత్‌నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న రమేశ్ రాథోడ్

పాల్వంచ: జిల్లాలో పలు పట్టణాలు, గ్రామాల్లో నాటిన కోనో కార్పస్ మొక్కల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి ఉందని గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్‌రాథోడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అటవీ శాఖ అధికారి రంజిత్ నాయక్‌ను కలిసి సొసైటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కోనో కార్పస్ పుష్పాల నుంచి విడదయ్యే పుప్పొడి వల్ల అలర్జీ, శ్వాసకోశ, ఆస్తమా సమస్యలు వస్తాయని అనేక అధ్యాయనాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. వాటి వేర్ల వల్ల కూడా అనేక అనర్థాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఏడారి మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దాసరి కిరణ్ కుమార్, పుష్పాల వెంకట కృష్ణ, మురళీ, బానోతు వేణు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

- జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య
- ఘనంగా పోషణ్ వారోత్సవాలు ప్రారంభం



టేకులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

టేకులపల్లి: పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం లభిస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని టేకులపల్లి, బోడు, సులానగర్, బొమ్మనపల్లి, గంగారం సెక్టార్ల పరిధిలో 126 అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ పక్షం (వారోత్సవాలు) ఘనంగా ప్రారంభం అయ్యాయి. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కనకయ్య వారోత్సవాలను



జూలూరుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న గర్భిణులు, బాలింతలు



టేకులపల్లి: తల్లులు, బిడ్డలచే ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ప్రారంభించారు. పోషకాహారం వంటలను పరిశీలించారు. మండలంలోని మిగిలిన సెక్టార్లలో వారోత్సవాలను ప్రారంభించారు. తల్లీబిడ్డల చేత చేతులను శుభ్రం చేయించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తానని, పోషకాహారం తీసుకుంటానని ప్రతిజ్ఞ చేయించారు. తల్లిదండ్రులకు పోషకాహార వంటల పోటీలు నిర్వహించి ప్రోత్సాహకాలు అందించారు. టీచర్లు తయారు చేసిన చిరుధాన్యాలు, ఇతర పోషకాహార వంటలను పరిశీలించారు. సీడీపీఓ మాట్లాడుతూ... ఆకుకూరలు, కూరగాయల్లో ఎక్కువ పోషకాలు ఉంటాయని వాటిని ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఏప్రిల్ 3 వరకు పోషణ వారోత్సవాలు జరుగుతాయని, క్రమం తప్పకుండా ప్రతిరోజూ అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 15 రోజుల పాటు ప్రతి కేంద్రంలో సంబురాల సందడి కనిపించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అనురాధ, సక్కుబాయి, లక్ష్మి, యశోద, నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం జూలూరుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వారిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చిరుధాన్యాలు ప్రాముఖ్యత గురించి వివరించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమాలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 1 వరకు జరుగుతాయన్నారు. మార్చి 20 నుంచి జూన్ 1 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా అంగన్‌వాడీ టీచర్లు గృహ సందర్శన చేసి, సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, నాగమణి, సుజాత, టీచర్లు విజయలక్ష్మి, సుభద్ర, నీల, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పెనగడప గ్రామంలో సింగరేణి మెడికల్, అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన 80 మంది ప్రజలకు షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తరువాత తీసుకోవాల్సిన జాగ్రతలు, ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కళావతి, ఏరియా ఎస్ఓటూ జీఎం శ్రీరమేష్, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, సీనియర్ పీఓ శ్రావణ్ మెడికల్, హెల్త్ డిపార్ట్‌మెంట్ల సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో 'ఆరోగ్య మహిళ'..

చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని రాష్ట్ర అబ్జర్వర్ డాక్టర్ సైదులు, వాణి సందర్శించారు. ఈ సందర్భంగా వారు క్యాన్సర్, రక్తహీనత, మూత్రకోశ వ్యాధులు, సుఖవ్యాధులు, రుతుక్రమ, ఒబేసిటీ, సంతాన సమస్యలకు సంబంధించి ఈరోజు సుమారు 78 మందిని పరీక్షించినట్లు డాక్టర్ వాణి తెలిపారు. కార్యక్రమంలో ఏఎంఓ కృష్ణయ్య, హెచ్ఈఓ వెంకటేశ్వరరావు, హెచ్ఎస్ పూర్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టంపై సమగ్ర విచారణ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: భారీ వర్షంతో జరిగిన పంట నష్టంపై సమగ్ర విచారణ కోరుతూ ప్రజాపంథా ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా చేశారు. సాగు చేసిన పంటల వివరాలు, జరిగిన నష్టాన్ని వివరిస్తూ వ్యవసాయశాఖ అధికారులకు రాతపూర్వకంగా అందజేశారు. సమగ్ర విచారణ చేపట్టి రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయిని రాజు మాట్లాడుతూ.. ఆరుగాలం శ్రమించి పండించిన పంట భారీ వర్షంతో నీటిపాలైందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. ప్రభుత్వం అరకొరగా సర్వే చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో స్థానిక రైతులతో కలిసి సమగ్రంగా విచారణ చేసి నష్టపోయిన ప్రతిరైతుకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బుర్ర వెంకన్న, ఆవుల కిరణ్, ఆజ్మీర బిచ్చా, శ్రీరాం కోటయ్య, సూర్నపాక రామ్మూర్తి, తులిసా, ధర్మన్న, చాట్ల వెంకన్న, బుర్ర లక్ష్మయ్య పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి

జూలూరుపాడు: ప్రాణ హాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని కోరుతూ వెంగన్నపాలెం గ్రామానికి చెందిన దళితుడు తంబర్ల నరసింహారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గుండెపుడి రెవెన్యూ పరిధిలో తాత, ముత్తాతల నుంచి సక్రమించిన సర్వే నంబర్ 253లో 1.09 ఎకరాల ఇనామ్ భూమిని వెంగన్నపాలెంకు చెందిన ఓ వ్యక్తి అక్రమంగా పట్టా పొందాడని అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. మా భూమి మాకు ఇప్పించాలని 25 రోజులుగా జూలూరుపాడులో నిరసన తెలుపుతున్నామన్నారు. తను బయటకు వెళ్తే గుర్తు తెలియని వ్యక్తులు వెంబడిస్తున్నారని, జన సంచారం లేని ప్రదేశానికి వెళ్తే చంపే అవకాశం ఉందని, రక్షణ కల్పించాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నరసింహారావు చెప్పాడు.

నర్సరీలో మొక్కల పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలరాజు

టేకులపల్లి: ప్రకృతి వనాలు, నర్సరీల నిర్వహణలో ఎవరైనా సరే నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని టేకులపల్లి ఎంపీడీఓ దుద్దుకూరి బాలరాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం బోడు, కొప్పురాయి, చుక్కాలబోడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన బృహత్ ప్రకృతి వనాలు, బోడు, కొప్పురాయి, మొక్కంపాడు, పెట్రాంచెలక, ఎర్రాయిగూడెం గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆయన పరిశీలించారు. మొక్కల సంరక్షణ పూర్తి బాధ్యత కార్యదర్శులదేనని, మొక్కలను జాగ్రత్తగా కాపాడాలని పేర్కొన్నారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ కాళంగి శ్రీనివాస్, కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఆయుష్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



టేకులపల్లి కేజీబీవీలో కిట్లతో విద్యార్థినులు

టేకులపల్లి: ఆయుష్ విభాగం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేందర్, మండల ఆయుర్వేద వైద్యురాలు గడిపల్లి విజయశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఆయుర్వేద క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి బాలికలకు ఆయుష్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. మిగిలిన బాలికలకు రాగి లడ్డులను అందజేశారు. పరీక్షల సమయంలో పిల్లలకు అంటువ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలు రాకుండా ఆయుష్ కిట్లు కవచంలా పని చేస్తాయని జిల్లా సీనియర్ మెడికల్ ఆఫీసర్ రాజేందర్ అన్నారు. ఈ కిట్లను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ యోగాసనాలు సాధన చేయాలని, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడ నిరోషా పాల్గొన్నారు.

జూలూరుపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో మంగళవారం విద్యార్థినులకు జూలూరుపాడు ప్రభుత్వ యునానీ ఆస్పత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.రాజేందర్‌రావు ఆయుష్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేందర్‌రావు మాట్లాడుతూ.. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు న్యూట్రిషన్ కిట్లు, రాగి లడ్డూలు అందజేశామన్నారు. గృహాల్లో ఔషధ మొక్కలు పెంచుకోవాలని, రక్తహీనతకు తీసుకోవాల్సిన ఆహారపదార్థాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ ఎం.పద్మజ, టీచర్లు, యునాని సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వనమా కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచ: మున్సిపాలిటీలోని వనమా కాలనీలో సమస్యలు తాండవిస్తున్నాయని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేశ్ అన్నారు. మంగళవారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి కాలనీలో పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కామేశ్ మాట్లాడుతూ.. వనమా కాలనీలో కనీసం రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు కూడా సరిగా లేవన్నారు. సమస్యల సాధన కోసం బీఎస్పీ పోరాటాలు చేసి పరిష్కరించేలా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, మాలోతు భానుమతి, మంజు, శ్రీదేవి, శకుంతల, ప్రమీల, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

సుజాతనగర్: గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. వేపలగడ్డ గ్రామానికి చెందిన నడికట్టు విజయ్‌కుమార్‌రెడ్డి (42) కొంతకాలంగా చుంచుపల్లి మండలం, విద్యానగర్‌లో నివాసం ఉంటున్నాడు. వారం రోజుల క్రితం అస్వస్థతకు గురై వైద్యచికిత్స తీసుకుని మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో గుండెపోటు రావడంతో ఇంట్లో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. మృతదేహన్ని విద్యానగర్ స్వస్థలం వేపలగడ్డకు తరలించారు. మృతుడికి భార్య రమాదేవి, కూతురు, కుమారుడు ఉన్నారు.

పాఠశాలలో ఉగాది వేడుకలు



పూజలు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి మేదరబస్తీలో గల శ్రీ రాగా ప్లే స్కూల్‌లో ముందస్తుగా మంగళవారం ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ముందుగా కరస్పాండెట్ మల్లారపు వరప్రసాద్, స్కూల్ డైరెక్టర్ మల్లారపు కవితలు పూజా కార్యక్రమాలతో ఉగాది సంబరాలను ప్రారంభించారు. పాఠశాల ఆవరణం అంతా మామిడి తోరణాలు, పూలమాలలు, ముగ్గులతో ఉగాది పండుగ ఉట్టిపడేలా అలంకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులందరూ స్వయంగా పిండివంటలు, పూర్ణాలు, బొబ్బట్లు, పులిహోర, పరమాన్నం తీసుకొచ్చి పండుగ చేసుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కవిత ప్రత్యేకంగా కొత్త కుండలో ఉగాది పచ్చడి తయారు చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితాల్లో కష్టసుఖాలు సహజమే అంటూ ఉగాది పచ్చడి విశిష్టతను తెలియజేశారు. చిన్నారులు తెలుగింటి అమ్మాయి, అబ్బాయిలు, పంచాంగం చెప్పే అయ్యవార్లుగా ఫ్యాన్సీ డ్రెస్సుల్లో అలరించారు. అయ్యవారిచే పంచాంగ శ్రవణం ముచ్చట గొలిపింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, రాధిక, పద్మావతి, పుష్పలత, నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఎమ్మెల్యే వనమాను సన్మానిస్తున్న సెర్ప్ ఉద్యోగులు



ఇల్లెందురూరల్: క్షీరాభిషేకం చేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, సెర్ప్ ఉద్యోగులు

ఇల్లెందురూరల్: పేస్కేల్ ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని హర్షిస్తూ సెర్ప్ ఉద్యోగులు మంగళవారం సంబురాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియకు పూలమాల అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచుకొని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, పులిగళ్ల మాధవరావు, జేకే శ్రీను, ఖమ్మంపాటి రేణుక, సెర్ప్ ఏపీఎంలు దుర్గారావు, సుభాష్, సత్యనారాయణ, రవి, సీసీలు ఖమ్మంపాటి నర్సింహారావు, రాంబాబు, రామ్మూర్తి, లాలయ్య, సంపత్, అలీ, వీరారెడ్డి, వీరభద్రం, ప్రసాద్, మల్లయ్య, బిచ్చానాయక్, కొమ్మాలు, నరేష్, అపర్ణ, నాగేంద్ర, రాములమ్మ, భూలక్ష్మి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): సెర్ప్ ఉద్యోగస్తులకు పేస్కేల్ వర్తింపజేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ జీఓ విడుదల చేసిన సందర్భంగా మంగళవారం ఉద్యోగులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును సెర్ప్ ఉద్యోగులు ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి మండలం ఏపీఎం ఎం.రాజు, ఐబీ ఏపీఎం సుభాష్, క్లస్టర్ కోఆర్డినేటర్ రామతిరుపతి, భాస్కర్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: స్థానిక స్త్రీ శక్తి భవనంలో మంగళవారం సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం పేస్కేల్‌ను వర్తింపజేస్తూ జీఓ విడుదల చేసిన సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఐకేపీ సిబ్బంది క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, ఐబీఏపీఎంలు సుభాష్, క్లస్టర్ కోఆర్డినేటర్లు మురళీ, శ్రీనివాస్, రవి, పద్మ పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లను అడ్డుకుంటాం..

పాల్వంచ: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఓ జాతీయ నేత విగ్రహం ఏర్పాటు పేరుతో భారీ మొత్తం వసూళ్లకు పాల్పడే చర్యలను అడ్డుకుంటామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబుజగ్జీవన్ రాం వారసుల ఐక్యవేదిక వ్యవస్థాపకులు వానపాకుల రాంబాబు అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఉన్న బాబుజగజ్జీవన్ రాం విగ్రహాన్ని ధ్వంసం చేసి కాంస్య విగ్రహం పెడతామని పనులు చేపట్టి ఏడాదిగా పనులు చేయకుండా కేవలం వసూళ్లకు మాత్రమే పాల్పడుతున్నారని, దీనిని ఆరు నెలల క్రితమే తాము అడ్డుకున్నట్లు చెప్పారు. ఇటీవల వీరి బెదిరింపులకు బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో నిర్వాహకులు, కేటీపీఎస్ ఉద్యోగి, మరో పార్టీ నాయకుడిపై కేసులు నమోదు అయ్యాయన్నారు. వ్యాపారస్తులు, కాంట్రాక్టర్లు, అధికారుల వద్ద ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పేరు వాడుతూ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కానీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు వీరి ఆగడాలకు ఎలాంటి సంబంధం లేకున్నా వీరి అవసరాలకు పలువురు నాయకుల పేర్లను వాడటం అలవాటుగా మారిందన్నారు. దళితులకు వీరి వల్ల ఒరిగిందేమీ లేదని, ఒక్క దళిత పథకమైనా వీరి నుంచి వచ్చిందా అని ప్రశ్నించారు. సమావేశంలో దండి రవి, సూదిపాక మధు, ఎల్.వసంత్, దుర్గారావు, కోట వెంకటేశ్వర్లు, మహేశ్, వెంకటరత్నం, రామకృష్ణ, గణేశ్, రాజు, రమేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'గురుకుల' మోడల్ పేపర్లు పంపిణీ



మోడల్ పేపర్లు అందజేస్తున్న మద్దెల శివకుమార్

సింగరేణి(కొత్తగూడెం): గురుకుల ప్రవేశ పరీక్షకు హాజరయ్యే 5వ తరగతి విద్యార్థులకు నిమ్మలగూడెం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు మద్దెల శివకుమార్ తన సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన మోడల్ పేపర్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మద్దెల మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు, నాణ్యమైన భోజన వసతిని కల్పించి విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వేస్తోందన్నారు. ఈ పుస్తకాలు చదివి, ప్రవేశ పరీక్షలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి రమేష్, విద్యాకమిటీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు ఎండీ షఫీ అహ్మద్, ఉష, లావణ్య పాల్గొన్నారు.

పీవీకే – 5 షాఫ్ట్ పంప్ హౌస్ తనిఖీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే – 5 షాఫ్ట్‌లో పంప్ హౌస్‌ను మంగళవారం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుద్రంపూర్ ఏరియాకు సరిపడా మంచినీటిని ఫిల్టర్ చేసి పంపించాలని, పంపులు 24 గంటలు నడిచేవిదంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అత్యవసర సమయాల్లో సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని, కాలనీలలో నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. పంప్‌హౌజ్‌లో ఉన్న రెండు బోర్‌వెల్స్‌కు మోటార్లు అమర్చాలని ఆదేశించారు. అదేవిధంగా గనిలో మ్యాన్ రైడింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మైన్ ఏజెంట్ బూర రవీందర్, గ్రూప్ ఇంజనీర్ ఉపేందర్, సర్వేయర్ ప్రదీప్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మిర్చిపంటను పరిశీలిస్తున్న రాంబాబు

పాల్వంచరూరల్: మండలంలోని ఉల్వనూరు, జగన్నాథపురం, పాండురంగాపురం, దంతలబోరు, యానంబైల్, రేగులగూడెం, మామిడిగూడెం తదితర గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజాపంథా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని జగన్నాథపురంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న మిర్చితోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అకాల వర్షాలకు పంటలతోపాటు నివాసాలు పూర్తిగా కూలిపోయాయని, మామిడికాయలు నేలరాలాయని ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూణెం రమేష్, పద్మ, రామ్‌శ్రీ, గోనేల రమేష్ , తాటి వెంకటేశ్వర్లు, కల్యాణ్ పాల్గొన్నారు.

నవరాత్రి వేడుకలకు ముస్తాబు



పూలతో అలంకరించిన పెద్దమ్మతల్లి ఆలయం

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనక దుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో నేటి నుంచి 30వ తేదీ వరకు జరగనున్న శ్రీదేవి వసంత నవరాత్రి ఉత్సవాలకు ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వస్తీశ్రీ చాంద్రమానేన శ్రీశోభకృత్ నామ సంవత్సరం చైత్రశుద్ధ పాడ్యమి నుంచి చైత్రశుద్ధ నవమి వరకు వసంత నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు ఈఓ ఎస్.రజనీ కుమారి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఉగాది రోజున ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు దంపతులతో కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. తొమ్మిది రోజులపాటు ఆలయంలో అమ్మవారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, వేదపారాయణ, సువాసునులచే సామూహిక కుంకుమార్చన, మమాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకము, శ్రీచక్రార్చన, సూర్యనమస్కారములు, మంత్ర అనుష్ఠానములు, లక్ష మల్లికా కుసుమార్చన, రాత్రి సమయంలో నీరాజన, మంత్రపుష్పము నిర్వహించనున్నట్లు తెలిపారు.